
# సెన్సస్



నేనొక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినిని. ఒకసారి నన్నూ, నాతోపాటు మరికొందరు టీచర్లను చిన్నపిల్లల జనాభా లెక్కలు తీయడానికి నియమించారు. అంటే ఒక్కొక్క యింట్లో ఎంతమంది పిల్లలు వున్నారనే కాకుండా - ఎంతమంది ఛదువుకుంటున్నారు అనే విషయం మీద కూడా మేం వివరాలు సేకరించాలన్న మాట. 'ఓస్ యిదెంత పని' అనుకుని మేము రంగంలోకి దూకాం. మాకు మూడు కాలనీలు కేటాయించారు. ఆ మూడు కాలనీలు చుట్టి వచ్చేసరికి ముల్లోకాలు చుట్టినంత పనైంది మాకు. అప్పటికిగాని తెలిసి రాలేదు అదెంత కష్టమైన పనో.

ఆ కాలనీలలోకి ప్రవేశించడానికి ముందుగానే మాకో మురికి కాలవ ఎదురుపడింది. ఆ ప్రదేశమంతా అపరిశుద్ధంగా వుంది. అయినా అక్కడి వాళ్ళు ఆదే గంగానదిలా భావించి అందులోనే సకల కృత్యాలు చేసుకుపోతున్నారు. ఎలాగో ముక్కు మూసుకుని కాలవ దాటాము.

అవన్నీ సామాన్య మధ్యతరగతి కుటుంబాలు. మొట్టమొదట ఒక యింట్లో ప్రవేశించాము.

"మీ ఇంటి యజమాని పేరేమిటమ్మా?" అనే ప్రశ్నతో ప్రారంభించాం.

ఆవిడ సనాతన స్త్రీలా అనిపించింది చూడగానే. అందుకు తగ్గట్టుగానే ఆవిడ "అయ్యో... ఆయన పేరు నేనెలా చెప్పను? ఆయనా యింట్లో లేరాయె — పోనీ పిల్లలచేత చెప్పిద్దామనుకుంటే వాళ్ళూ ఆడుకోడానికి వెళ్ళారాయె" అంటూ సాగదీసింది.

ఇక లాభంలేదని ఒక్కొక్క దేవుడి పేరే అడుగుతూ వచ్చాము. చివరికి "తిరుపతి దేవుడి పేరేనా?" అని అడిగాం.

"అవును" అని తలాడించిందావిడ.

హమ్మయ్య అనుకుని "అయితే వెంకటేశ్వర్లు అన్న మాట" అన్నాం.

"వెంకటేశ్వర్లు కాదు. వెంకయ్య" అన్నదా యిల్లాలు.

నా స్నేహితురాలికి వళ్ళు మండింది. "ఆ మాట మొదటే చెప్పొచ్చుగా హోటల్లో సర్వర్ పదార్థాల పట్టిక చదివినట్లు దేవుళ్ళ పేర్లు చదవాల్సిన అవస్థ మాకు తప్పేదిగా" అని గొణిగింది.

అక్కడినుంచి బయటపడి పక్కింటికి వెళ్లాం. ఈవిడో మతిమరుపు మనిషిలా వుంది. భర్త పేరు చెప్పి "అదే అనుకుంటాను. సరిగా గుర్తులేదు. పెళ్లిలో ఎప్పుడో చెప్పించిన పేరు" అంటూ సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది.

మరో యింట్లో - "బడికి వెళ్ళే పిల్లలు ఎవరైనా వున్నారా?" అని అడిగితే "లేరు" అని సమాధానం చెప్పిందా యిల్లాలు.

అక్కడో కుర్రాడు గోళీలాడుకుంటున్నాడు. అతన్ని చూసి, "మరైతే ఆ అబ్బాయి ఎవరు?" అని అడిగాము.

"మా పిల్లాడే. మూడో క్లాసు చదువుతున్నాడు. వాళ్ళకిప్పుడు సెలవులు. అంచేత బడికి వెళ్ళటం లేదు" అన్నదా అయోమయం.

మరోచోట మమ్మల్ని, మా చేతులోని ఫైళ్ళని, భుజాన వున్న బ్యాగులని చూడగానే గబుక్కున తలుపులు మూసేశారు. మాకు అర్థంకాక ఒకరి మొహాలొకరు చూసుకున్నాం. ఎంత తలుపు తట్టినా వాళ్లు తియ్యలేదు. మేం విధి సరిగా నిర్వర్తించామో లేదో చూసేందుకు ఓ చెకింగ్ వుందాయె. అంచేత తలుపు మీద 'సమాధానం లేదు' అని రాశాం. మేం నాలుగడుగులు వేయగానే తలుపులు తెరిచి తలుపు మీద మేం రాసిన అక్షరాలని ఆ యింట్లో వాళ్ళు తుడిచేయసాగారు. ఆ ప్రదేశంలో ఒకప్పుడు అమ్మవారి భయం వుండేదిట. మేం సూదులు పొడవడానికి వచ్చామేమోనన్న భయంతో వాళ్ళు తలుపేసుకున్నట్లున్నారు.

తిరిగి తిరిగి చివరికి రెండో కాలనీకి వచ్చాం.

"అమ్మా! ఈ యింట్లో చదువుకునే పిల్లలున్నారా?" అని ఆ కాలనీలో ఒకావిడని అడగ్గానే ఆవిడ భోరుమని ఏడవడం ప్రారంభించింది. కారణం తెలియక మేం బిక్క చచ్చిపోయాం. బతిమాలగా బతిమాలగా ఆవిడ ఏడుపు మాని, "నాకు ముగ్గురు పిల్లలు వుండేవాళ్ళు. మాయదారి రోగం వాళ్ళని పొట్టన పెట్టుకుందిరోయ్ దేవుడా" అంటూ చెప్తూ చెప్తూనే ఏడుపు లంకించుకుంది. ఇక





యడవల్లి అనూరాధ

కొందరు చదువుల్లో చాలా గొప్ప ప్రావీణ్యత చూపిస్తారు. అలాంటివాళ్లలో యడవల్లి అనూరాధ ఒకరు. ఇరవైఒక్కఏళ్ల అనూరాధ, ప్రతిచోటా ప్రథమశ్రేణిలో వస్తూ రెండుసార్లు 'స్వర్ణపతకాలు' కూడా పొందింది. ఆమె యస్. యస్. సి చదువుతున్నప్పుడు 'ఫస్ట్‌క్లాస్' తెచ్చుకున్నది. దాంతోపాటు 'నేషనల్ మెరిట్ సర్టిఫికేట్' కూడా పొందింది. ఇంటర్‌మీడియట్‌లో కూడా 'ఫస్ట్‌క్లాస్'లో వచ్చింది. బి. యస్‌సి (బోటనీ)లో (వాల్తేరు) కూడా ప్రథమశ్రేణిలో వచ్చింది! తర్వాత సాగర్ యూనివర్శిటీ (మధ్య ప్రదేశ్) ద్వారా యమ్. ఎస్‌సిలో కూడా ప్రథమ శ్రేణిలోనే వచ్చింది. బోటనీలోనూ, బయోసైన్సెస్‌లోనూ ప్రథమశ్రేణిలో వచ్చినందుకుగాను, ఆమె రెండు బంగారు పతకాలు పొందింది. అనూరాధ ఆ యూనివర్శిటీలోనే పిహెచ్.డి. చెయ్యాలనుకుంటున్నది. ఆమె తండ్రి శ్రీ వై. వి. సన్యాసిరావు-ఫెర్రో అల్లాయేస్ కార్పొరేషన్ (శ్రీరామ్‌నగర్)లో లా ఆఫీసర్‌గా వుంటున్నారు.

—టి. వి

ఆవిడ్ని ఓదార్చడం మా తరం కాదని పక్కింటికి చేరుకున్నాం.

ఆ పక్కింటావిడ ఏదో వంట పనిలో మునిగి వుంది. మేం రెండు మూడుసార్లు అరిచినా పలక లేదు. ఓ పావుగంట తర్వాత యివతలికి వచ్చి "మా యింట్లో బడికి వెళ్లే పిల్లలెవరూ లేరు" అంది తాపీగా. "వంటంతా అయిందా తల్లీ" అని పరామర్శిద్దామనుకుని బలవంతాన ఆపుకుని అక్కడ్నుంచి బయటపడ్డాం.

మరో యింట్లో వీటన్నిటికన్న భిన్నమైన పరిస్థితే ఎదురైంది మాకు. మేం కుటుంబ నియంత్రణ శాఖనుండి వచ్చామనుకుని ఆవిడ ముగ్గురు పిల్లల్ని వంటింట్లో దాచి యిద్దరబ్బాయిల్ని మా ముందుకు తోసింది. "మాకు వీళ్లిద్దరే పిల్లలు. నిజం....యిప్పట్నుంచి ఆపరేషన్ ఎందుకండీ" అంటూ నాన్చింది. ఆపరేషన్ అంటే ఆవిడకి భయమనీ, వాళ్లాయనకి యిష్టంలేదనీ సోది చెప్పడం ప్రారంభించింది.

అసలు మేం ఎవరమో....ఎందుకు వచ్చామో చెప్పడానికే ఆవిడ అవకాశం యివ్వలేదు. ఇంతలో వంటింటి తలుపు చాటునుంచి ఓ అమ్మాయి తొంగి చూసి "అమ్మా! నేను బయటికి రావచ్చా.... వాళ్ళెళ్ళిపోయారా?" అని అరిచింది.

పాపం ఆవిడ తేలుకుట్టిన దొంగలాగా మావైపు చూసింది. ఈవిడతో లాభం లేదనుకుని ఆ పాపను పిలిచి మాకు కావలసిన వివరాలు రాసుకున్నాము.

ఈ జనాభా లెక్కల సేకరణ కాదుగానీ మాకు ఎందరో విచిత్రమైన వ్యక్తులు ఎదురయ్యారు. కొందరు యిల్లాళ్ళకు, తమ పిల్లలు ఏ బడిలో చదువుతున్నారో తెలీదు. మేమే కొన్ని కొండ గుర్తులు చెప్పి అది ఏ స్కూలో తెలుసుకుని రాసుకున్నాం.

మరో యింట్లో మమ్మల్ని చూడగానే చందాల వాళ్ళం అనుకుని "ప్రతి సంవత్సరం వీళ్ళతోశ తద్దినం" అని విసుక్కుంటూ కుక్కని మా మీదకి ఉసికొల్పారు. బెదిరిపోయి ఒక్క పరుగుతో యివతలికి వచ్చిపడ్డాం.

ఆ పక్కింట్లో "మీ అబ్బాయి ఎప్పుడు పుట్టాడు?" అని ప్రశ్నిస్తే, "మా అబ్బాయి పుట్టినరోజు నాకు సరిగ్గా గుర్తులేదు. కాని యిక్కడ గంగమ్మ జాతర జరిగింది తెలుసుకదా....సరిగ్గా ఆ రోజే పుట్టాడు వీడు" అందావిడ ప్రేమగా పిల్లాడి తల నిమురుతూ. ప్రతి సంవత్సరం జాతర జరుగుతూనే వుంటుంది. ఏ సంవత్సరపు జాతర అని రాసుకోం చెప్పండి!

కొందరు పిల్లల వయసు తెలియదంటారు. తెలిసినా కావాలనే తప్పు చెప్పేవారు కొందరు. అక్కడ మూడోక్లాసు పాఠం చదువుతున్న ఓ అబ్బాయిని చూసి "అతని కెన్నేళ్ళు" అని అడిగాము.

"ఆరేళ్ళు....మొన్ననేగా వచ్చాయి" అంది వాళ్ళమ్మ.

మేం ఆశ్చర్యంతో తల మునకలయ్యాము 'ఆరేళ్ళకే మూడోక్లాసు చదివేంతటి బృహస్పతా' అనిపించింది. ఇంతలో ఆ అబ్బాయే మా సమస్య తీర్చాడు. పాపం తర్వాత తిట్లుతిన్నా తినివుంటాడు. ఇంతకీ ఆ అబ్బాయి అన్నది ఒక్కమాటే — "అమ్మా! నాకు ఎనిమిదేళ్ళు కదే!"

మరో యింట్లో వాళ్ళబ్బాయి వయసు 'ఆరు' అందా యిల్లాలు. "అయితే పుట్టిన సంవత్సరం 1973 కదూ" అంటే "అరె...మీకెలా తెలుసు... ఎంత తెలివైనవాళ్లో" అంటూ ఆశ్చర్యపోయిందా యిల్లాలు.

ఆ పక్క యింట్లో ఆమె "నేను చెప్పేది నిజమే...కావాలంటే ప్రమాణం చేస్తాను. మా అబ్బాయి చదివేది ఒకటోక్లాసు. వాడి వయసు తొమ్మిది" అంటూ వాదించబోయింది.

పక్క వాటాలో ఆమె అయితే "మా పాప వయసు ఆరు సంవత్సరాలు. పుట్టింది 1970 లో" అంటూ ఏవేవో రుజువులు చూపడానికి ప్రయత్నించింది.

ఈవిడైనా ఫరవాలేదుగానీ మూడో కాలనీలో ఒక యింట్లో మేం అడిగినవాటికి సమాధానం చెప్పకుండా మమ్మల్నే ప్రశ్నించడం ప్రారంభించారు. మా స్కూలు, ఉద్యోగం, జీతం గురించి వివరాలు అడగడం, మా చీరలు, నగలు ముట్టుకుని చూస్తూ వాటి గురించి ఆరాలు తీయడం వంటివి చేయసాగారు. వాళ్ళదగ్గర నుంచి మాకు కావలసిన వివరాలు సేకరించేప్పటికి మరో జన్మ ఎత్తినంత పనైంది మాకు.

అయితే ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఇన్ని యిబ్బందుల మధ్య కూడా కొందరి ప్రవర్తన మాకు ఎంతో హాయిగా అన్పించింది. వాళ్లు ఎంతో ఓపికగా సమాధానాలు చెప్పి సహకరించారు.

అలా మూడు రోజులపాటు ఆ స్వర్గభూమిలో విహరించిన మేము చివరికి ఎలాగైతేనేం 'పిల్లల జనాభా లెక్కల తంతు ముగిసింది' అనిపించాక, "అమ్మయ్య" అనుకున్నాం.

—ఎమ్. ఎస్. కమల